# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 16, మే 2026


### పశువుల అక్రమ రవాణాపై ఉక్కుపాదం..

# చట్టాన్ని అతిక్రమిస్తే కఠినచర్యలు

★ మంచిర్యాల డీసీపీ భాస్కర్

★ గోరక్షక్ సభ్యులతో సమన్వయ సమావేశం ★ ఏడు శాశ్వత చెక్‌పోస్టుల ఏర్పాటు



**నస్పూర్, మే 15, ప్రభాతవార్త**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ హెచ్చరించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం మంచిర్యాల పట్టణంలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో గోరక్షక్ సభ్యులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ రవాణా నిరోధానికి తీసుకుంటున్న చర్యలు, అనుసరించాల్సిన చట్టపరమైన నిబంధనలపై సభ్యులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆవులు, దూడలను వధించడం నిషేధమని, పశువులను తరలించే సమయంలో వాటికి ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని డీసీపీ స్పష్టం చేశారు. అక్రమ రవాణాకు పాల్పడితే ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ యాక్ట్, కౌస్లాటర్ యాక్ట్, బీఎన్‌ఎస్ చట్టాల కింద వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అయితే, గోరక్షక్ పేరుతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని దాడులకు పాల్పడినా, వాహనాలను ధ్వంసం చేసినా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, వారిపై కూడా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు 7 శాశ్వత చెక్‌పోస్టులతో పాటు ప్రధాన రహదారులపై మరో 15 ఆకస్మిక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీసీపీ వెల్లడించారు. పశువుల రవాణాకు వెటర్నరీ డాక్టర్ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 లేదా కంట్రోల్ రూమ్ నంబర్ 8712656597 కు తెలపాలని కోరారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, ఇన్‌స్పెక్టర్లు ప్రమోద్‌రావు, రవీందర్, రమణమూర్తి, అశోక్ కుమార్, హనుక్, జోన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.



# అక్రమాలపై ఉక్కుపాదం..

✹ 35 వాహనాలు సీజ్.. సైబర్ నేరాలపై అవగాహన

✹ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: పోలీసులు

**మందమర్రి, మే 15, ప్రభాతవార్త**

మందమర్రి మండలంలోని సారంగపల్లి గ్రామంలో బెల్లంపల్లి ఏసీపీ వి. కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు మందమర్రి పోలీసులు గురువారం సాయంత్రం ఆకస్మిక కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు ప్రజల్లో భద్రతా భావం పెంపొందించేందుకు ఈ తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, వీధుల్లో పోలీసులు నాకాబందీ నిర్వహించి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బైకులు, ఆటోలను ఆపి వాటికి సంబంధించిన ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. తనిఖీలలో సరైన ధృవీకరణ పత్రాలు లేని, నంబర్ ప్లేట్లు సక్రమంగా లేని 35 మోటార్ సైకిళ్లు, ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వాహనదారులకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని పోలీసులు హెచ్చరించారు. తనిఖీల అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పోలీసులు సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. బ్యాంక్ ఖాతాలు బ్లాక్ అయ్యాయని, లాటరీ తగిలిందని చెప్పే ఫోన్ కాల్స్‌ను నమ్మి ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయరాదని, అవి ఫోన్ హ్యాకింగ్‌కు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే 100 నంబర్‌కు సమాచారం అందించాలని, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి గ్రామాన్ని నేర రహితంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్స రమేష్, మందమర్రి ఎస్ఐ జి. నరేష్, రామకృష్ణాపూర్ ఎస్ఐ శ్రీధర్‌తో పాటు 25 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సాయంత్రం వేళ నిర్వహించిన ఈ ఆకస్మిక తనిఖీలను గ్రామస్తులు అభినందిస్తూ, పోలీసుల అప్రమత్త చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.

# వరి ధాన్యం నిల్వ ప్రక్రియ సక్రమంగా చేపట్టాలి

✪ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**లక్షెట్టిపేట, మే 15, ప్రభాతవార్త**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు త్వరితగతిన తరలించాలని, ధాన్యం దెబ్బతినకుండా నిల్వ ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం రోజు లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో గల ధాన్యం గోదామును లక్షెట్టిపేట మండల తహసిల్దార్ దిలీప్ కుమార్, వ్యవసాయ అధికారి ఆర్. శ్రీకాంత్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని, సంబంధిత రైస్ మిల్లర్లు, అధికారులు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒక రోజులో కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని సూచించారు. ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

★ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**నస్పూర్, మే 15, ప్రభాతవార్త**

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సమగ్ర శిక్ష, అలింకో సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ శిబిరానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగాలలో దివ్యాంగుల రిజర్వేషన్లు కల్పించి ప్రోత్సహిస్తుందని, దివ్యాంగులకు అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల 152 మంది పిల్లలకు వివిధ రకాల సహాయ ఉపకరణాలు అందించడంలో అలింకో సంస్థ చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వం దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లల ఉన్నతికి తోడ్పాటు అందించాలని, పిల్లలను మిగతా 2లో..

## రక్తదానం చేయడంతో అత్యవసర పరిస్థితులలో ప్రాణాలను కాపాడవచ్చు

**- జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్ కుమార్ దీపక్**

**నస్పూర్, మే 15, ప్రభాతవార్త**

రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితులలో ప్రాణాలను కాపాడవచ్చు అని జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రెడ్ క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు పి. చంద్రయ్య, జిల్లా కార్మిక శాఖ అధికారి, నోడల్ అధికారి దుర్గం క్రాంతి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా గర్భిణులకు ప్రసవ సమయంలో, రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి అత్యవసర పరిస్థితులలో, సికిల్ సెల్ తల సేమియా వ్యాధిగ్రస్తుల ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. యువత రక్తదాన శిబిరాలలో స్వచ్ఛందంగా పాల్గొని ప్రజల ప్రాణ రక్షణలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ, ఈ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలు స్వచ్ఛందంగా తమ వివరాలతో సభ్యత నమోదు చేసుకొని, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి అందించే సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులో ఉన్న భవిత కేంద్రానికి పంపించాలని తెలిపారు. ప్రతి శనివారం హోమ్ బేస్డ్ లర్నింగ్, వారానికి రెండుసార్లు ఫిజియోథెరపీ శిబిరాలు ఉంటాయని, దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు కృష్ణమూర్తి, భరత్ కుమార్, జె. సత్తయ్య, దండేపల్లి, జైపూర్ మండల విద్యాధికారులు రాజు, శ్రీనివాస్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

**- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు**

**చింతలమానేపల్లి, మే 15, ప్రభాతవార్త:**

ఛత్రపతి శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కర్జవెల్లి గ్రామంలో ఆరె కులస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. తొలుత గ్రామ కమిటీ సభ్యులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి, కాషాయ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధైర్యానికి, దేశభక్తికి శివాజీ నిదర్శనమని కొనియాడారు. ఆరె కులస్తుల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి ఓబీసీ సర్టిఫికెట్లు వచ్చేలా ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో ఆరె కులస్తుల కోసం కమ్యూనిటీ భవనం నిర్మించేలా చూస్తానన్నారు. దిందా, కర్జవెల్లి పరిధిలోని పోడు భూముల సమస్యలను అధికారులతో మాట్లాడి, రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాష్, డా. కొత్తపల్లి శ్రీనివాస్, కుల సంఘం నేతలు డుబ్బుల నానయ్య, ఓడీల భాస్కర్, డుబ్బుల వెంకయ్య, ఎలములే మల్లయ్య, చౌదరి నానయ్య, రంగన్న, హరి, చంద్రశేఖర్, నారాయణ, గణేష్, లక్ష్మణ్, మహేష్, తొంబ్రే శీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేదుకు యంత్రాంగం సిద్ధంగా వుండాలి

**ఆసిఫాబాద్, మే 15, ప్రభాతవార్త :**




వచ్చే వర్ష కాలంలో వరదలు విపత్తుల వల్ల ఆస్తులు, ప్రాణ నష్టము జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె హరిత అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాతీయా విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు న్యూ ఢిల్లీ నుండి నిర్వంహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఎం డెవిడ్, కాగజ్ నగర్ డివిజన్ అటవీ అధికారి అప్పయ్యతో కలిసి కలెక్టర్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదలు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అస్తి, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అప్రమతంగా వుండాలన్నారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సమయంలో వరదలు వచ్చి జనవాసనం స్తంభించి పోతుందని, ఆ సమయంలో ప్రజలను రక్షించి వారికి పునరావాసం ఏర్పాటు చేపట్టాలన్నారు. జిల్లాలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణమే స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. వరదలు వచ్చే సమయంలో ప్రజను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో విపత్తులు సంభవించి నప్పుడు ప్రజలను రక్షించడానికి రేస్కు బృందాలు సిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి ఆహారం, త్రాగునీరు, వైద్య చికిత్సలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్, అగ్నిమాపక, నీటిపారుదల శాఖ, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన

**కాగజ్‌నగర్ రూరల్ ,మే 15, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్స వాల్లో భాగంగా శుక్రవారం 5వ రోజు డిపార్ట్మెంట్ ఆఫ్ లైబ్రరీ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధ్యాపకుడు తూడూరు దత్తాత్రేయ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్, రైల్వే, టీఎస్‌పీఎస్‌సి వంటి వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో పాటు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలను విద్యార్థులకు , చదువరులకు ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి మాట్లాడుతూ ఇలాంటి పుస్తక ప్రదర్శనలు విద్యార్థులకు వివిధ రకాల పుస్తకాలపై అవగాహన పెంపొందించడంతో పాటు వారి విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అంతేకాకుండా కళాశాలలోని హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఇంగ్లీష్, తెలుగు, బోటనీ, ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, జువాలజీ, హిందీ విభాగాల ఆధ్వర్యంలో ఆయా విభాగాల ఫ్యాకల్టీ సభ్యులు కూడా పుస్తక ప్రదర్శనలో పాల్గొని తమ విభాగాలకు సంబంధించిన పుస్తకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. లక్ష్మీనరసింహం గారు, కళాశాల కోఆర్డినేటర్ శ్రీ దుర్గం జనార్దన్ గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**హాజీపూర్, మే 15, ప్రభాతవార్త**

హాజీపూర్ మండలంలోని గుడిపేట, సబ్బపల్లి గ్రామంలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను శుక్రవారం రోజు మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు అనంతరం మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు మొక్కజొన్న పంటకు ఒక ఎకరానికి 26 క్వింటాలు మాత్రమే తీసుకుంటున్నారు. ఎలాంటి షరతులు లేకుండా ఎకరానికి 40 క్వింటాలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంటా అయిన తర్వాత పంటను తరలించడానికి బ్యాగుకు 2 రూపాయల చొప్పున అడుగుతున్నారు. గతంలో రెండు రూపాయలు అనేది ఎప్పుడూ తీసుకోలేదు. ఇది అవినీతికి నిలువెత్తు నిదర్శనం కాదా అన్నారు. రైతు పండించిన పంటలను కొనవలసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి అని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు రాజుల బతికిన కాలం చూసాం కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది అని అన్నారు. వెంటనే రైతుల పండించిన పంటను ఎలాంటి షరతులు, తరుగు లేకుండా కొనుగోలు చేయాలని లేని పక్షంలో రైతుల తరపున బిఆర్ఎస్ పార్టీ పోరాడుతుంది అని తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొనుగోలు నిర్వాహకులతో కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ పఠనా శక్తిని పెంపొందించుకోవాలి: మేయర్ మధుకర్

**నస్పూర్, మే 15, ప్రభాతవార్త**



పుస్తకాలు మనిషికి మిత్రుల వంటివి, విజ్ఞాన సముపార్జనకు గ్రంథాల యాలను వేదికలుగా చేసుకోవాలని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠకులతో నిర్వహించిన ముఖాముఖ కార్యక్రమంలో పుస్తకాల ప్రాముఖ్యత, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. జ్ఞాన సముపార్జనలో పుస్తక పఠనం కీలక పాత్ర పోషిస్తుందని, విద్యార్థులు, యువత గ్రంథాలయాల్లోని వనరులను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మేయర్ సూచించారు. నిరంతరం పుస్తకాలు చదువుతూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్న ఉత్తమ పాఠకులను మేయర్ ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రంథాలయ సిబ్బంది మేయర్ ను మర్యాదపూర్వకంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రంథాలయంలో పాఠకులకు అవసరమైన మరిన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని మేయర్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది చక్రవర్తి, సంపత్, పెద్ద సంఖ్యలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల కోసం సులభతరం చేసిన సిఎంపిఎఫ్ సేవలు

**బెల్లంపల్లి, మే 15, ప్రభాతవార్త**

సిఎంపిఎఫ్ సేవలను పారదర్శకంగా, వేగంగా ఉద్యోగులకు అందించేందుకు కృషి చేస్తున్నామని సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ భరత్ కుమార్ ఏవై తెలిపారు. శుక్రవారం రోజున గోలేటిలోని జనరల్ మేనేజర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రయాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎంపిఎఫ్‌కు సంబంధించిన అన్ని లావాదేవీలు సికేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే నిర్వహించబడుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం ఎస్‌వీ రాజేశ్వర్ రావు, సీనియర్ పర్సనల్ అధికారి ఎం. శ్రీనివాస్, సిఎంపిఎఫ్ సిబ్బంది మనోహర్, అనిత, ఏఐటీయూసీ నాయకులు మారం శ్రీనివాస్, కిరణ్, శేషశయన రావు తదితరులు, అన్ని విభాగాల సిఎంపిఎఫ్ క్లర్కులు పాల్గొన్నారు.

## రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

**మందమర్రి, మే 15, ప్రభాతవార్త**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో కె.కె.5 ఇన్‌క్లైన్ గని పరిధిలోని ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 17వ తేదీ ఆదివారం రోజున రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్‌లో ఈ శిబిరం జరగనుంది. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని సన్‌రైజ్ హాస్పిటల్‌కు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని సేవలు అందించనున్నారు. గుండె, నాడీ, జీర్ణవ్యవస్థ, కిడ్నీ సంబంధిత వ్యాధులకు సంబంధించిన పరీక్షలు, సలహాలు అందించబడతాయి. ముఖ్యంగా కార్డియాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, నెఫ్రాలజీ విభాగాలకు చెందిన నిపుణులు రోగులను పరిశీలించనున్నారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారు ముందుగా రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వైద్య సేవలకు హాజరయ్యే ఉద్యోగులు తమ ఎండీ కార్డ్, హాస్పిటల్ బుక్ తీసుకురావాలని, అలాగే మాజీ ఉద్యోగులు తమ సిపిఆర్ఎంఎస్ఎన్ఈ కార్డ్ వెంట తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కె.కె.5 ఇన్‌క్లైన్ మేనేజర్ తెలిపారు.

# ఘనంగా గ్రంథాలయ దినోత్సవం



**తాండూర్, మే 15, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని తాండూర్ శాఖ గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. ఉత్తమ పాఠకులు దండ నాయకుల రవిశంకర్, రేవెల్లి చంద్రశేఖర్ లను ఉత్తమ పాఠకులుగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠకులు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భండాగారాలని దేవాలయం తో సమానమన్నారు. గ్రంథాలయాలను పాఠకులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయం పార్ట్ టైం స్వీపర్ స్వామి, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

**లక్షెట్టిపేట, మే 15, ప్రభాతవార్త** తెలంగాణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా లక్షెట్టిపేట ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న విద్యావారోత్సవాల్లో అయిదవ రోజు మన గ్రంథాలయ జ్ఞానోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల





ప్రిన్సిపాల్ డా. మహాత్మా సంతోష్ అధ్యక్షతలో కళాశాల లైబ్రేరియన్ నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో కళాశాల గ్రంథాలయం వెబ్ సైట్ ప్రారంభం, బుక్ ఎగ్జిబిషన్, పుస్తకాల విరాళం, కొత్త పుస్తకాల ఆవిష్కరణ, పుస్తక సమీక్షలు విద్యార్థులకు పోటీలు వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. మహాత్మా సంతోష్ కళాశాల గ్రంథాలయం గూగుల్ వెబ్ సైట్ ని ప్రారంభించారు. బుక్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. మహాత్మా సంతోష్ మాట్లాడుతూ.. గ్రంథాలయాలు జ్ఞాన కేంద్రాలని ఒక్కో పుస్తకం ఒక్కో జీవితాన్ని పరిచయం చేసి సమున్నతమైన ప్రతిభ పొందడంలో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగ పరుచు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల తెలుగు అధ్యాపకులు రచించిన వెన్నెల సాహచర్యం ఈ పుస్తకాన్ని, తెలుగు విభాగం నిర్వహించిన సృజనాత్మక రచన కార్యశాల సావనీర్ పుస్తకాన్ని ప్రిన్సిపాల్ఆవిష్కరించారు. విద్యార్థులు సృజనాత్మక రచనలో ప్రావీణ్యం సంపాదించాలని పేర్కొన్నారు. లైబ్రేరియన్ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ..



గ్రంథాలయాన్ని ప్రతిరోజు సందర్శించడం ద్వారా పుస్తకాలు మాత్రమే కాకుండా డిజిటల్ లైబ్రరీ వాడకాన్ని కూడా అలవర్చుకోవాలని ప్రపంచంలోని పుస్తకాలన్నీ ఉచితంగా సౌకర్యం డిజిటల్ లైబ్రరీ కల్పిస్తుందని తెలిపారు. విద్యార్థుల కోసం అధ్యాపకులు ప్రజలు పుస్తకాలను లైబ్రేరీలకు విరాళంగా ఇవ్వాలని కోరారు. పలువురు అధ్యాపకులు గ్రంథాలయ జ్ఞానోత్సవం సందర్భముగా కాలేజీ లైబ్రెరీకి విలువైన పుస్తకాలను విరాళంగా ఇచ్చారు.గ్రంథాలయాన్ని రోజు సందర్శించిన ఉత్తమ విద్యార్థులకు పుస్తకాలను బహుమతులుగా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. మహాత్మా సంతోష్, లైబ్రేరియన్ నాగేశ్వర్ రావుతో పాటు అధ్యాపకుల శంకరయ్య , ప్రేమలత, తన్నీరు సురేష్, తిరుపతి, శ్రీనివాస్, రాజ్ కుమార్, కవిత, సంధ్యారాణి, స్వప్న, స్వామి, ప్రసన్న, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**సారంగాపూర్, మే 15, ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల కేంద్రంలో విద్యా వారోత్సవాలను పురస్కరించుకుని గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మహేందర్ మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధపడే నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. పుస్తక పఠనంతో ప్రతి ఒక్కరూ తమ మేధాసంపత్తిని పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కాంతారావు, ఎంపీడీవో లక్ష్మీకాంత్, సర్పంచ్ కోనేరు భూమన్న, ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

**భైంసా, మే 15, ప్రభాతవార్త:** భైంసా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రంథాలయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె. బుచ్చయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సమన్వయకర్త డాక్టర్ భీమారావు పఠన సంస్కృతి, డిజిటల్ లైబ్రరీల ప్రాముఖ్యతను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రఘునాథ్, ఐక్యుఏసీ సమన్వయకర్త డాక్టర్ రవి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు డిజిటల్ వనరులను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు పుస్తకాలపై సమీక్ష నిర్వహించి, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించే అంశాలను వివరించారు. అనంతరం "కాంపెండియం"ను ఆవిష్కరించి, ఉత్తమ పాఠకుడిగా ఎంపికైన విద్యార్థి లక్ష్మణ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం. శంకర్, అరె రాజు, డాక్టర్ ఓంప్రకాష్, డాక్టర్ సంతోష్, డాక్టర్ కల్పన, నాహేదా, సురేందర్ పాల్గొన్నారు.

## రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### - వ్యవసాయ అధికారి బుక్క గిరీశం



**సిర్పూర్ టి, మే 15, ప్రభాతవార్త:** మండలంలోని టోకిని గ్రామంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ పిప్రే రాందాస్, వ్యవసాయ అధికారి బుక్క గిరీశం కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి గిరీశం మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు తమ వరిని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించడం ద్వారా సరైన ధర పొందవచ్చని తెలిపారు.సర్పంచ్ పిప్రే రాందాస్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల ప్రయోజనార్థం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రతి రైతు వినియోగించుకోవాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శేఖర్, వీవో అధ్యక్షురాలు పద్మ, ఏపీఎం మహేష్, ఏఈఓ నేహా తపసుం, సీసీ రాజేశ్వర్, వీఓఏ పాండు, రైతులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**నస్పూర్, మే 15, ప్రభాతవార్త** నిరుపేదల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32 వ డివిజన్ లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతిని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని, పనుల వేగవంతానికి ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పెండింగులో ఉన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఆలస్యానికి గల కారణాలపై లబ్ధిదారులతో మాట్లాడి ఆయా ఇండ్ల నిర్మాణాలు చేస్తున్న గుత్తేదారులను పిలిపించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. డివిజన్ లో పర్యటించి నెలకొన్న సమస్యల వివరాలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకుని పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధికారి, గృహ నిర్మాణ శాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా విద్యా వారోత్సవాలు

### - మీడియా ప్రతినిధులకు సన్మానం చేసిన ఉపాధ్యాయ బృందం

### - సమాజ శ్రేయస్సులో మీడియా పాత్ర గొప్పదని వాక్య



**చెన్నూరు, మే 15, ప్రభాతవార్త** సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే వారే పాత్రికేయులని కిష్టంపేట్ డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మీడియా ప్రతినిధులను కళాశాల ఉపాధ్యాయ బృందం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మీడియా పాత్ర కీలకమని అన్నారు. సమాజంలో ఎదురవుతున్న ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో వాటి పరిష్కారానికి బాటలు వేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమైనదని కొనియాడారు. ప్రభుత్వ పథకాల చేరవేతలో అగ్రగామి.. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను గ్రామీణ స్థాయిలోని సామాన్య ప్రజలకు సైతం చేరవేయడంలో మీడియా విశేష సేవలు అందిస్తోందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏంవి పట్వర్ధన్ పేర్కొన్నారు. నిరంతరం ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సమాజ చైతన్యానికి తోడ్పడుతున్న విలేకరుల సేవలు అభినందనీయమని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏం.వి. పట్వర్ధన్, ముఖ్య అతిథి మహావాది సుభాష్,వైస్ ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ అధ్యాపకులు, స్థానిక విలేకరులు పత్రికా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జీఎం విజయ భాస్కరరెడ్డిని సన్మానించిన ఓఎస్డీ

**బెల్లంపల్లి, మే 15, ప్రభాతవార్త**



ఈ నెలలో పదవీ విరమణ పొందనున్న బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర రెడ్డిని కోల్ కంట్రోల్ ఆఫీస్, కొత్తగూడెం ఓఎస్డీ ఎ. కృష్ణ మోహన్ రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా సన్మానించారు. బెల్లంపల్లి ఏరియా పర్యటనలో భాగంగా వచ్చిన ఆయన జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు, అలాగే భవిష్యత్తులో ప్రారంభంకానున్న కొత్త గనుల అభివృద్ధిపై సమగ్రంగా చర్చించారు. అనంతరం జనరల్ మేనేజర్ విజయ భాస్కర రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి, ఆయన సేవలను కొనియాడుతూ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎస్ఓ టు జీఎం ఎన్. ఉమాకాంత్, డీజీఎం(ఐఈ) ఉజ్వల్ కుమార్ బెహెరా, ఎస్టేట్ అధికారి సాగర్, బిపిఎ ఓసి మేనేజర్ మహేష్, కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ అధికారి వి. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధి నివారణకు సమిష్టిగా కృషి చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, మే 15, ప్రభాతవార్త**



జిల్లాలో డెంగ్యూ వ్యాధి నివారణకు సమిష్టిగా కృషి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఈ నెల 16వ తేదీన జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్. అనిత, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్, అధికారులతో కలిసి డెంగ్యూ నివారణపై గోడప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల నిర్మూలన కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎండాకాలం నుండి వర్షాకాలం ప్రారంభమయ్యే సమయంలో వాతావరణంలో దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, జికా వ్యాధులు వ్యాపిస్తాయని, పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. డెంగ్యూ జ్వరము ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులతో కూడిన తీవ్ర జ్వరము అకస్మాత్తుగా వస్తుందని, కళ్ళలో నొప్పి, శరీరంపై చిన్నపాటి దద్దుర్లు కనిపిస్తాయని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరీక్ష చేయించుకోవడానికి రాపిడ్ డయాగ్నొస్టిక్ కిట్లు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో తెలంగాణ డయాగ్నొస్టిక్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎలిసా టెస్ట్ అందుబాటులో ఉందని, ప్రజలు ఎలాంటి భయాందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. దోమల నివారణలో భాగంగా వారానికి ఒకసారి డ్రైడే పాటించాలని, ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూడాలని, మురుగు కాలువలలో చెత్తా చెదారం తొలగించాలని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో తగు చర్యలు చేపట్టాలని, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సంబంధిత శాఖల సమన్వయంతో పని చేస్తూ జిల్లాలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ రవి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, మే 15, ప్రభాతవార్త**

నేరడిగొండ మండల కేంద్రంలో మార్కుఫెడ్ ఆధ్వర్యంలో పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్న రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వం సరిపడా గన్నీ సంచులు (బార్దాన్లు) సరఫరా చేయాలని కోరారు. అనంతరం ఒక రైతును ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## విద్యావనరులు, డిజిటల్ సేవలపై అవగాహన

**నేరడిగొండ, మే 15, ప్రభాతవార్త:**

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఐదవ రోజు నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యావనరులు, డిజిటల్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ షబానా మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞానభాండాగారాలని, పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. గ్రంథాలయాల్లో చదివిన ఎంతోమంది మేధావులు సమాజంలో గొప్ప స్థాయిలో నిలిచారని పేర్కొన్నారు. అనంతరం డిజిటల్ కాటలాగ్, ఈవనరులు, ఆన్‌లైన్ లెర్నింగ్ విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ గంగాధర్, అధ్యాపకులు మమత, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

**సారంగాపూర్, మే 15, ప్రభాతవార్త:**

మండలంలోని యాకర్ పెల్లి గ్రామానికి చెందిన శనిగరపు లక్ష్మణ్ (40) ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా నీలాయిపేట్ ప్రాంతానికి చెందిన లక్ష్మణ్ తన భార్య, కొడుకుతో కలిసి గత 15 ఏళ్లుగా యాకర్ పెల్లిలో నివాసం ఉంటున్నారు. మృతుడు లక్ష్మణ్ సరిగా పనికి వెళ్లకుండా మద్యానికి బానిసై తిరుగుతుండటంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. నిన్న సాయంత్రం తాగిన మైకంలో ఇంటి నుండి వెళ్లిన లక్ష్మణ్ తిరిగి రాలేదు. దీంతో గ్రామస్తులు వెతకగా ఈ రోజు ఉదయం వంజర్ గ్రామ శివారులోని మామిడి తోటలో ఉరి వేసుకొని మృతి చెంది కనిపించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఎల్కపల్లిలో ఉచిత దంత వైద్య శిబిరం

**పెంచికల్ పేట్, మే 15, ప్రభాతవార్త :**

మండలంలోని ఎల్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నేడు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్ కు చెందిన ప్రముఖ దంత వైద్యులచే ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ రాంచందర్ తెలిపారు. దంత సమస్యలు ఉన్న ప్రజలు వైద్య శిబిరన్ని సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు.



## కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య**

**నస్పూర్, మే 15, ప్రభాతవార్త**

రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, హమాలీలు, గన్ని బ్యాగుల కొరత లేకుండా అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సీతారాంపల్లిలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మేయర్ ధర్ని మధుకర్‌తో కలిసి సందర్శించారు. కేంద్రంలో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించి, రైతులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. ప్రభుత్వం ధాన్యం రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన గన్ని బ్యాగులను, లారీలను అందుబాటులో ఉంచిందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. కేంద్రం నిర్వాహకులు సాధ్యమైనంత త్వరగా ధాన్యాన్ని తరలించి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, స్థానిక కార్పొరేటర్ సౌమ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధర్ని మల్లేష్, ఐకేపీ సెంటర్ ఇన్‌ఛార్జి సురిమిల్ల వర్ష వెంకటేష్, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు, సీతారాంపల్లి, పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## 17న జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం

**నస్పూర్, మే 15, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ కే. కార్తీక్, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఈ. రామచందర్ తెలిపారు. శుక్రవారం వారు విడుదల చేసిన ఒక ప్రకటనలో సమావేశ వివరాలను వెల్లడించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు మంచిర్యాల పట్టణంలోని వివేకవర్ధిని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ సమావేశం ప్రారంభం కానుంది. జిల్లాలో కబడ్డీ క్రీడ అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణ, నిర్వహించబోయే పోటీల గురించి ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. ఈ సమావేశానికి మంచిర్యాల జిల్లాలోని 18 మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు. క్రీడాభివృద్ధికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకోనున్నందున ప్రతి ఒక్కరూ సమయానికి రావాలని విన్నవించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

**పెంచికల్‌పేట్, మే 15, ప్రభాతవార్త :**



మండలంలోని దరోగపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీడీవో సంతోష్ రెడ్డి పరిశీలించారు. పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు, అధికారులకు సూచించారు. అనంతరం నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన గ్రామం సర్పంచ్ బొట్టుపల్లి కృష్ణవేణి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మధుకర్, నాయకులు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

**- కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త సాద్వి**

**తాండూర్, మే 15, ప్రభాతవార్త :**

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి సాధించాలని కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త సాద్వి అన్నారు. మండలంలోని ద్వారకపూర్ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సమతుల్య ఎరువుల వినియోగం, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణమైన పంటల ఎంపిక, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. అలాగే రైతులు పంటల విభిన్నీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) వైపు దృష్టి సారించి మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం, విలువ ఆధారిత పంటలు మరియు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే పద్ధతుల గురించి రైతులకు వివరించారు. రైతులు అడిగిన వివిధ వ్యవసాయ సంబంధిత ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇస్తూ, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మసాడి తిరుపతి, ఉప సర్పంచ్, వ్యవసాయ అధికారి సుష్మ, ఉద్యానవన అధికారి అర్చన, ఏ ఈ ఓ శంకర్, కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.



# పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి

● ఎంసీపీఐయూ పార్టీ డిమాండ్




**బెల్లంపల్లి, మే 15, ప్రభాతవార్త**

దేశవ్యాప్తంగా అర్ధరాత్రి నుంచి పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని ఎంసీపీఐయూ పార్టీ మంచిర్యాల జిల్లా కమిటీ ఘాటుగా డిమాండ్ చేసింది. పెరుగుతున్న ఇంధన ధరలు సామాన్య ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నాయని, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు ఆర్థికంగా కుదేలవుతున్నారని నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎంసీపీఐయూ పార్టీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడారు. వారు మాట్లాడుతూ లీటరుకు రూ.3 చొప్పున పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం పూర్తిగా అన్యాయమని, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు వాటిని విరుద్ధంగా పెంచుతూ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం అన్ని రంగాలపై పడుతుందని, ముఖ్యంగా రవాణా ఖర్చులు పెరగడం వల్ల అవసరమైన వస్తువుల ధరలు కూడా పెరిగి సామాన్య ప్రజల జీవన వ్యయం మరింత అధికమవుతుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటో డ్రైవర్లకు ఆదాయం తగ్గిపోగా, ఇప్పుడు డీజిల్ ధరల పెంపు వారికి మరింత కష్టాలను తెచ్చిపెడుతోందని పేర్కొన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిలో ఉన్న ఆటో డ్రైవర్లకు ఇది మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టే అని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి ప్రజలపై పడుతున్న భారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎంసీపీఐయూ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, రోడ్లపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తోగరి రాహుల్, శేఖర్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు

- ఎన్‌టీఏ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలి
- టీవీయూవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 15, ప్రభాతవార్త**

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టీవీయువి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం రోజున మంచిర్యాల జిల్లా కేంద్రంలో టీవీయూవీ ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది విద్యార్థులు రెండేళ్ల పాటు కష్టపడి సిద్ధమైన నీట్ పరీక్షల విశ్వసనీయత కేంద్ర ప్రభుత్వం, విద్యాశాఖ నిర్లక్ష్యం కారణంగా దెబ్బతిందని తీవ్రంగా ఆరోపించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఈ ఘటనకు సంబంధిత మంత్రి నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని అన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనలతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతిష్ట దెబ్బతిందని, విద్యార్థుల్లో నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అత్యంత భద్రతతో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పుకునే సంస్థ నుంచే ఇలాంటి వివాదాలు రావడం దురదృష్టకరమన్నారు. డాక్టర్లు కావాలనే లక్ష్యంతో కష్టపడి చదివి పరీక్షలు రాసిన విద్యార్థులు తీవ్ర నిరాశకు గురయ్యారని, తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మళ్లీ నమ్మకం కలిగించేలా ఎన్‌టీఏ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని, పరీక్షల నిర్వహణలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, ఈ అంశంపై ప్రధానమంత్రి జోక్యం చేసుకుని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రంజిత్, తరుణ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.





## నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

- రైతులు పంటల మార్పిడి విధాన విధానాన్ని అవలంబించాలి

**హాజీపూర్, మే 15, ప్రభాతవార్త**

రైతులు పంటల మార్పిడి విధానాన్ని అవలంబించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు.శుక్రవారం రోజు గడ్ పూర్ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా, డా. జె. సాయి ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి డా. పి. శివ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మంచిర్యాల డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కృష్ణ,మండల వ్యవసాయ అధికారి కృష్ణ, కలిసి రైతు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అధికంగా రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల వ్యవసాయ ఆదాయం, మానవ ఆరోగ్యం, పర్యావరణం పై కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. వరి, మొక్కజొన్న అవశేషాలను కంపోస్టు గుంతల ద్వారా సేంద్రియ ఎరువులుగా మార్చుకోవడం, పచ్చి ఎరువుల పంటలను ప్రోత్సహించడం, వరి ఏక పంట విధానాన్ని తగ్గించి పంటల మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా నేల సారాన్ని పెంచుకుని ఆదాయాన్నిమెరుగుపరుచుకోవాలని సూచించారు. అదనంగా పప్పుధాన్యాలు, పండ్లు,కూరగాయలు, ఆయిల్ పామ్ ఆధారిత అంతర పంటల సాగు ప్రాముఖ్యతను వివరించారు.అదేవిధంగా వరి సాగులో నీటి సంరక్షణకు ప్రత్యామ్నాయ తడుపుఎండబెట్టే విధానం ఫార్మ్ పాండ్ల వినియోగం వంటి సమర్థవంతమైన నీటి నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు అనుకూలమైన వరి రకాలపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. సహజ సేంద్రియ ఎరువుల వినియోగంతో సమగ్ర వ్యవసాయ విధానం అనుసరించడం ద్వారా వనరుల సమర్థ వినియోగం, జీవనోపాధి భద్రత, స్థిరమైన వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్ జాల లింగన్న,వ్యవసాయ విస్తరణ అధికారి మోనిక, రైతులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

**సారంగాపూర్, మే 15, ప్రభాతవార్త:**

మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు గంగారెడ్డి, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కరిపె విలాస్, బీజేపీ నాయకుడు కరుణాసాగర్ రెడ్డి, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై సీపీఐ(ఎం) మండిపాటు

**దస్తురాబాద్, మే 15, ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగియగానే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై మూడు రూపాయలు పెంచి ప్రజలపై అదనపు భారం మోపిందని విమర్శించారు. ఎన్నికల తర్వాత ప్రజలపై భారాలు మోపడం ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆరోపించారు. పెంచిన ధరల వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడతారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ధరలను తగ్గించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## శుభకార్యాల్లో పాల్గొన్న బాజీరావు పాటిల్

**భైంసా, మే 15, ప్రభాతవార్త:**

ముధోల్ నియోజకవర్గ యువ నేత బాజీరావు పాటిల్ శుక్రవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన శుభకార్యాల్లో పాల్గొన్నారు. బాసర మండలం బిద్రెల్లి గ్రామంలో మారుతి పటేల్ సోదరి వివాహ వేడుకకు, కుంటాల మండలం పెంచ్కల్‌పాడ్ సర్పంచ్ హిమ్మత్ రావు పటేల్ కుమారుడి వివాహానికి ఆయన హాజరయ్యారు. అలాగే ముధోల్ మండలం ఎడ్బిడ్ గ్రామంలో కార్యకర్త దినేష్ కుమార్తె వివాహానికి, తానూరు మండలం హంగిర్గాలో అవధూత్ పటేల్ కుమార్తె వివాహానికి, కుబీర్ మండలం సిరిపెల్లిలో గంట గణేష్ కుమార్తె వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బెంబర్ గ్రామంలో బాలాజీ యాదవ్ బంధువుల పుట్టుమంటి (పుట్టు వెంద్రుకల) కార్యక్రమంతో పాటు పలు గృహప్రవేశ కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 10వ తరగతిలో టాపర్‌గా నిలిచిన అవంతికకు ఘన సన్మానం

**కాగజ్‌నగర్ రూరల్, మే 15, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామానికి చెందిన వాడే నాగేష్ – వాడే గాయత్రి దంపతుల కుమార్తె వాడే అవంతిక 10వ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జడ్పీ ఎస్ఎస్ గర్ల్స్ స్కూల్‌లో టాపర్‌గా నిలిచి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వసాకే పుల్లబాయి, కాగజ్‌నగర్ మండల్ మాలి సంఘం జనరల్ సెక్రటరీ వసాకే హనుమంతు, గ్రామ పెద్దలు రవి, రామయ్య, శ్రీనివాస్, రవీందర్ తదితరులు అవంతికను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించిన అవంతిక ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని వారు కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు.

## సేంద్రియ సాగు పద్ధతులు పాటించండి

**దహెగాం, మే 15, ప్రభాతవార్త :**



వ్యవసాయం లో సేంద్రియ సాగు పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. దహెగాం మండలంలో ఖర్జి గ్రామంలోని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలలో తక్కువ యూరియా వాడండి సాగు ఖర్చులను తగ్గించండి నేల ఆరోగ్యాన్ని కాపాడండి. పంటలో అవసరం మేరకు రసాయనాలను వినియోగించండి ప్రకృతిని రక్షించండి. సాగు చేసే పంటలలో పంట మార్పిడి పాటించండి. అధిక ఆదాయాన్ని పొందండి మార్కెట్లో ఎక్కువ గిరాకీ ఉన్న వరి రకాలను సాగు చేయండి. అధిక లాభాలను పొందండి. సాగు నీటిని ఆదా చేసి భావితరాలకు అందించండి సేంద్రియ పద్ధతులను పాటించి ఆరోగ్యాకరమైన ఆహారాన్ని అస్వాదించండి రైతులకు శాస్త్రవేత్తలు చాలా వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా సిహెచ్ భరత్ భూషణ్ రావు, డా డి శిరీష,ఏ ఈ వో శిష్మిత, గ్రామ సర్పంచ్ తుమ్మిడే అంకు బాయి వార్డ్ మెంబర్ జునుగారి సంతోష్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిని ప్రభుత్వం ఏటీఎంలా వాడుకుంటోంది

## బీఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య - జూన్ 7న భూపాలపల్లిలో బీఎంఎస్ ద్వైవార్షిక మహాసభలు

నస్పూర్, మే 15, ప్రభాతవార్త




సింగరేణి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం ఒక ఏటీఎంలా వాడుకుంటూ నిధులను విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తోందని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) అధ్యక్షులు యాదగిరి సత్తయ్య ఆరోపించారు. శుక్రవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 7వ తేదీన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బీఎంఎస్ ద్వైవార్షిక మహాసభలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. సింగరేణిలో భూగర్భ గనులు, ఉద్యోగుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం ఆందోళనకరమని సత్తయ్య పేర్కొన్నారు. సంస్థ భవిష్యత్తు అవసరాల కోసం కేటాయించిన నిధులపై యాజమాన్యం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎస్ఆర్ నిధులను స్థానిక ప్రాంతాల అభివృద్ధికి కాకుండా ఇతర ప్రాంతాలకు మళ్లించడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణికి రావాల్సిన 51 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. 12వ వేజ్ బోర్డు కమిటీ ఏర్పాటుకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని, కార్మిక వ్యతిరేక సర్క్యులర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాతాడి శ్రీధర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ బూంపల్లి రమేష్, రాజారామ్ కిరణ్, జెల్ల తిరుపతి, కొమ్మ బాపు, కుంట రాజు, అలిగేటి వెంకటేష్ అప్పాల బీరయ్య, గోళ్ళ సురేష్, చల్ల శ్రీనివాస్, మామిడాల నరేష్, శ్రీనివాస్, బుర్ర అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన

బెల్లంపల్లి, మే 15, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, కళాశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో ఐదవ రోజు సందర్భంగా శుక్రవారం రోజున బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో గ్రంథాలయ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠన అలవాటును పెంపొందించడం, జ్ఞానాన్ని విస్తరించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయ ఇన్‌చార్జ్, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి సమన్వయంతో ఈ ఉత్సవం విజయవంతంగా నిర్వహించబడినట్లు పేర్కొన్నారు.

### డిపార్ట్మెంట్ల వారీగా పుస్తకాల ప్రదర్శన...

గ్రంథాలయ ఉత్సవం సందర్భంగా వివిధ విభాగాలకు సంబంధించిన డిపార్ట్మెంటల్ లైబ్రరీల నుంచి సబ్జెక్టుల వారీగా పుస్తకాలను ప్రదర్శనకు ఉంచారు. అదనంగా కళాశాల ప్రధాన గ్రంథాలయంలోని అకాడమిక్ పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడే కాంపిటీటివ్ పుస్తకాలను కూడా విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విలేకరులకు కళాశాలలో లభ్యమయ్యే పుస్తక వనరులు, గ్రంథాలయ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సూపరింటెండెంట్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## పొనకల్ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

జన్నారం, మే 15, ప్రభాతవార్త



జన్నారం మండలం పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆశ్రమ పాఠశాలను మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పాఠశాలలోని వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆశ్రమ పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు నెమ్మదిగా సాగుతుండడం గమనించి కాంపౌండ్ వాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బక్కయ్య, ఎంపిడివో ఉమర్ షరీఫ్, ఎఎంసి చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, వార్డు సభ్యులు మోసిన్, పంచాయతీ కార్యదర్శి రాహుల్, బిల్ కలెక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## స్పర్శ్ సోషల్ ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

### - 116 మందికి వైద్య పరీక్షలు

కాగజ్‌నగర్ రూరల్, మే 15, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ మండలంలోని నందిగూడ గ్రామంలో ఎస్పీయం స్పర్శ్ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు సిర్పూర్ పేపర్ మిల్లు జిఎం హెచ్‌ఆర్ అండ్ ఐఆర్ గిరి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డా. శశిధర్ రెడ్డి మొత్తం 116 మందికి రక్తపోటు, షుగర్, జ్వరం ఇతర సాధారణ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామ ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం ప్రాముఖ్యతపై వైద్య బృందం అవగాహన కల్పించింది. మారుతున్న జీవనశైలిలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీయం జీఎం హెచ్‌ఆర్ ఐఆర్ గిరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్య భద్రత కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి, కార్యదర్శి నరేష్, సుశీల, తన్నీరు విజయ్‌కుమార్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పిసిసి చీఫ్‌ను కలిసిన మండల నాయకులు

తాండూర్, మే 15, ప్రభాతవార్త :



తాండూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం హైదరాబాద్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడిని శాలువతో సత్కరించి మండలంలోని ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ , నాయకులు మాసాడి తిరుపతి, బెల్లంపల్లి నియోజకవర్గ యూత్ సెక్రెటరీ మంతెన శివకృష్ణ, మండల యూత్ జనరల్ సెక్రెటరీ పురంశెట్టి అరుణ్ పాల్గొన్నారు.



## పీహెచ్‌సీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

భైంసా, మే 15, ప్రభాతవార్త:

కుంటాల మండల కేంద్రంలో 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ. 20 లక్షలతో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవన నిర్మాణానికి ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. నూతన భవనం అందుబాటులోకి వస్తే మండల ప్రజలకు వైద్య సదుపాయాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## తుడుం దెబ్బ మహాసభను విజయవంతం చేయండి

సిరికొండ, మే 15, ప్రభాతవార్త:

హనుమకొండలో ఈ నెల 17న నిర్వహించనున్న ఆదివాసీ ఐక్యత తుడుం దెబ్బ మహాసభను విజయవంతం చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం సిరికొండ మండల కేంద్రంలో మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం, సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాడాలని కోరారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని, జీవో 49ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అటవీ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవడం ఆపాలని, 1/70 చట్టం, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల అధ్యక్షులు పెందోర్ మహేందర్, గౌరవాధ్యక్షులు నాగోరావ్, మాజీ సర్పంచులు అనిల్ కుమార్, దత్తు, నాయకులు హిరమాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎండల వేడిమికి వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి

### - సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర నాయకులు మార్త సత్యనారాయణ

కాగజ్‌నగర్ రూరల్ ,మే 15, ప్రభాతవార్త :

రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతతో సీనియర్ సిటిజన్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర నాయకులు మార్త సత్యనారాయణ తెలిపారు. ఇంటా బయట ఉక్కపోతతో వృద్ధులు ఉక్కిరిబిక్కిరవుతున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావద్దని, అధికంగా నీరు సేవించాలని సూచించారు. అజాగ్రత్త వల్ల ప్రాణాపాయం సంభవించే అవకాశముందని కుటుంబ సభ్యులు కూడా వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రభుత్వం మరియు ఆరోగ్య శాఖ స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వయోధికుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని, అవసరమైతే వారి ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రతినిధులు కూడా ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలికోట రమణయ్య, నాగేశ్వరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.